# అపూర్వ బంధాలు

## వసుంధర

మా శ్రీవారు పెద్ద ఆఫీసరు. అందుకేనేమో ఆయనకు నామీదకంటె ఆఫీసుమీదే ఆసక్తి. సెలవు రోజుల్లోకూడా ఆఫీసుకు వెడతారు. మామూలు రోజుల్లో ఆఫీసుకు గంట ముందు వెడతారు. ఎప్పుడో తప్ప ఆఫీసు వదలగానే యింటికిరారు. ఆఫీసులో ఆయనకు చాలా మంచి పేరుంది.


ఆఫీసులో అంతపని చేసినా శ్రీవారెప్పుడూ నామీద విసుక్కోరు. నా పనుల్లో సాయపడలేకపోతున్నారని విచారపడుతుంటారు కూడా.

“ఇంట్లో [illegible]ది నేనేం చేస్తానండీ; నాకీ పనులేం ఎక్కువ కాదు”-అనే దాన్ని మొదట్లో.

క్రమంగా శ్రీవారు అన్ని పనులకూ నామీద ఆధార పడిపోసాగారు.

ఉదయం లేవగానే బ్రష్షు, పేస్టూ దగ్గర్నుంచి, షేవింగ్ సెట్ తుడుచుకునే తువ్వాలు, కట్టుకునే బట్టలవరకూ అన్నీ నేనే అందివ్వాలి. నా పనులు నేను చేసుకుంటూ ఇవన్నీ చేయాలి.

శ్రీవారికి జీవితమంటే విరక్తిట. నేను బ్రష్షు అందించగానే ఆయనలో కొత్త ఉత్సాహం పుడుతుందిట. నేను షేవింగ్ సెట్ అందిస్తే తుప్పుపట్టిన బ్లేడు కూడా మల్లెపువ్వులా మారి ఆయన గెడ్డాన్ని తాకుతుందట. నేను తువ్వాలందిస్తే హంసతూలికా తల్పంపైన దొరుకున్నట్టుంటుందిట. తన బట్టలు నేనే అందిస్తే-నేను తన ఒడిలో ఉన్నట్లే అనిపిస్తుందిట.




“నీ సమక్షమే నా జీవితానికి ఉత్సాహం” అంటారాయన.



ఈ పొగడ్తలు నాకెంతో ఇష్టం. వాటికోసం ఎన్ని పనులైనా చేస్తాను నేను.

అయితే వారికి లోకువైపోతానన్న భయంతో అప్పుడప్పుడు విసుక్కుంటాను. అది నిజం విసుగుకాదు. నటన!

అన్నింటికీ వారు నామీద ఆధారపడితే అది నాకెంతో గర్వంగా ఉంటుంది. అయితే ఇన్ని కబుర్లూ చెప్పి-నాకోసం ఆఫీసు వదల్లేకపోవడం నా మనసు చివుక్కుమనేలా చేస్తూంటుంది.

“నేనాఫీసులో పనిచేసేదే నీ కోసం కదోయ్” అంటారు వారు.

కానీ అందరిలా టంచనుగా ఆఫీసుకు





వెళ్ళి వచ్చేయొచ్చుగా.

దీనికీ వారు నన్ను మెచ్చుకునేవారు- "అందరికీ ఆఫీసులో పనిఉంటుంది. అందులోనూ పెద్ద జీతాలు తీసుకుంటున్నప్పుడు కొన్ని ప్రత్యేక బాధ్యతలుంటాయి. అవి సక్రమంగా నిర్వహించకపోవడం దేశద్రోహం. నువ్వు నన్నర్థం చేసుకుంటావని నాకు తెలుసు. అందుకే నా బాధ్యతను సక్రమంగా నిర్వహించగలుగుతున్నాను. అందరి భార్యలూ నీకులాంటి అవగాహన చూపించరు. అందుకే ఆఫీసులో వారికి చెడ్డపేరు. నా ఆఫీసులో నేను తెచ్చుకున్న మంచిపేరుకు పరోక్షంగా నువ్వే బాధ్యురాలివి"

ఈ మాట నాపై మంత్రంలా పని చేస్తుంది. అందుకే వారాఫీసులో పేరు తెచ్చుకునేందుకు మరింతగా సహకరిస్తుంటాను.

పెళ్ళయి ఈ విధంగా మాకు రెండేళ్ళు గడిచాయి.

ఆదర్శ దంపతులమని పేరుపడ్డమేము మొదటిసారి గొడవపడ్డరోజు-మా మూడవ పెళ్ళిరోజు.

ఆ రోజాయన్నాఫీసుకు సెలవు పెట్టమని వారం రోజులముందే చెప్పాను.

ఆయన అంగీకరించారు.

ఆ రోజు పూర్తిగా మా కోసం....

నాకెంతో ఉత్సాహంగా ఉంది.

దగ్గరుంటే శ్రీవారు కబుర్లెంతో బాగా చెబుతారు. అవి వినడం నాకెంతో ఇష్టం.

ఉదయం ఇద్దరం తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు కట్టుకున్నాం. వారికిష్టమైన పులిహోర టిఫెనుగా చేశాను.

వంటలోకి దిగబోతూంటే- "అప్పుడే ప్రారంభించకు. కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అన్నారువారు.

ఇద్దరం కలిసి పులిహోరతిన్నాం.

నన్ను పెళ్ళి చేసుకున్నాక వారి జీవితం ఏ విధంగా మారిపోయిందో వర్ణించి చెబుతున్నారు శ్రీవారు.

నాకు కాలం స్తంభించిపోయింది.

ఉన్నట్టుండి ఎవరో తలుపుతట్టారు.

వెళ్ళాను.

మావారి ఆఫీసు ప్యూను.

ఆఫీసులో ఏదో అర్జంటు పనుందట. వారు వెళ్ళడం తప్పనిసరి అట.

శ్రీవారు నాకు సారీ చెప్పి వెళ్ళిపోయారు.

నేను బాగా నిరుత్సాహపడ్డాను.

కాసేపటికి పక్కింటి వనజ మా యింటి కొచ్చి కూర్చుంది. నా నిరుత్సాహానికాశ్చర్యపడి కారణమడిగితే చెప్పాను

వనజ కిసుక్కున నవ్వి- "ఆఫీసు మానడం ఇష్టంలేని మగాళ్ళు సాధారణంగా చేసే ట్రిక్కే యిది-" అంది.

అంటే శ్రీవారు ముందుగా చెప్పి ప్యూన్‌ని ఇంటికి రప్పించుకున్నారని వనజ అభిప్రాయం.


ఆ ఆలోచనే నాకు కలగలేదు.

అప్పటికప్పుడు వనజకేదో చెప్పి పంపేశానుకాని ఈ అనుమానం నన్ను నన్ను పెనుభూతమై పీడిస్తోంది.

శ్రీవారిపై ఆఫీసరు ఫణిభూషణ్ మాకు దూరపు బంధువు. ఆయన అప్పుడప్పుడు మా యింటికి వస్తూ ఉంటారు. ఆయనకు యాభై ఏళ్ళుంటాయి. మితభాషి.

నేనెప్పుడూ ఆయనకు ఫోన్ చేయలేదు. ఆరోజు చేసి "అంకుల్! మా వారిని సెలవు కాన్సిల్ చేసుకుని రమ్మ



నడం అన్యాయం కదూ! ఎప్పుడో కాని వారు సెలవు పెట్టరు" అన్నాను.

ఆయన వెంటనే "లేదమ్మా! అతడు సెలవే పెట్టలేదు. మామూలుగానే ఆఫీసుకు వచ్చాడు" అన్నాడు.

నేనిక అట్టే మాట్లాడలేదు. ఫోన్ పెట్టేశాను.

మనసు చెప్పింది. వారు నన్ను మోసగించారు.

ఆ సాయంత్రం వారు టైముకే ఇంటికి వచ్చారు. మనిషి కాస్త భయం భయంగా ఉన్నారు. బహుశా ఫణిభూషణ్ నేను ఫోన్ చేసిన విషయం చెప్పి ఉంటాడు.

నేను ఆలస్యం చేయకుండా గొడవ ప్రారంభించాను.

"ఈ రోజు మన పెళ్ళిరోజు. వృథా కానివ్వకు. ఇంకోరోజు దెబ్బలాడుకుందాం-" అన్నారు వారు తేలికగా.

నా మనసు తేలిక పడలేదు. గొడవ పెంచాను.

"నిజంగా ఆఫీసులో అర్జంటు పని ఉంది. సెలవుపెట్టే అవకాశంలేదు. అలా [illegible] సుఖంపార్థం చేసుకుంటావని నీ మనసు నొప్పించకూడదనే ఉద్దేశ్యంతో ఫ్రెండింటికి రప్పించుకున్నాను. నీ మనసు బాధపడితే నేను భరించలేనని నీకు తెలియదూ?" అంటూ సంజాయిషీ ఇచ్చుకున్నారు వారు.

మామూలుగా అయితే మాటలకు లొంగి పోయేదాన్ని. ఆ రోజు నా కోపం అవధులు దాటింది.

కాసేపటికి ఒంటరిగానూ నేడి అందుకుంది.

"నేను చేసిన తప్పల్లా నిష్కర్షగా నీ మాట కాదనలేకపోవడం. ఇకనించి అలాగే ఉంటాన్లే" అన్నారు వారు.

"మీరు చెప్పే కల్లబొల్లి కబుర్లన్నీ నిజమని నమ్మి మోసపోతున్నాను. ఇక మీదట మోసిపోను. మీ అసలు రంగు తెలిసింపేరోజు-" అన్నాను

"అసలు కల్లబొల్లి కబుర్లు చెప్పాల్సిన అవసరం నాకేమిటి? ఇకమీదట ఇంట్లో ముక్తసరిగా ఉంటాను-" అన్నారు వారు.

నాకు చాలా కోపం వచ్చింది.

నేనంటే ఏమిటో తెలియకుండా ఉంది వారికి.

రెండ్రోజులక్రితం అక్కయ్య దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. తనకు నన్ను చూడాలనుందిట.

అక్కకూ నాకూ ఆరేళ్ళు తేడా. మేమిద్దరం నా పెళ్ళయ్యాక మళ్ళీ కలుసుకోలేదు. నేనింటికెళ్ళినప్పుడక్కకు వీలుపడేదికాదు. అక్క వెళ్ళినప్పుడు నాకు వీలుపడేదికాదు.


"మీరాఫీసుకి వెళ్ళడానికి నేనో పెద్ద అడ్డంకి కదా! నేను కొన్నాళ్ళపాటు మా అక్కదగ్గరకు వెడతాను. నేను కావాలనిపించినప్పుడు ఉత్తరం రాయండి వస్తాను" అన్నాను వారితో.

వారభ్యంతరం చెప్పలేదు.

నా మనసు చివుక్కుమన్నప్పటికీ నేను లేకపోతే తప్పవారికి నా విలువ తెలియదని ఊరుకున్నాను.

మర్నాడు వారు నా ప్రయాణానికి చకచకా ఏర్పాట్లు చేశారు.

• •




అక్క నన్నెంతో ఆదరంగా ఆహ్వానించింది.

ఇద్దరం చూడగానే ఒకరినొకరం కౌగలించేసుకున్నాం.

"మావారు చాలా మంచివారు. నిన్ను చూడాలనగానే పంపించేశారు"- అన్నాను అక్కతో. అది అబద్ధమే అయినా అందులో కొంత నిజమూ లేకపోలేదు.

అక్క నాకంటే ఆరేళ్ళ మాత్రమే పెద్దదైనా-తనెంతో ఆరిందాలాగా నేను చిన్నపిల్లనైనట్లూ ప్రవర్తించింది.

అందుకే అక్కంటే నాకు చాలా ఇష్టం. అక్కముందు నేనెప్పుడూ చిన్నపిల్లనైపోతాను. నేనేం చేసినా అక్క ముచ్చటపడుతుంది.

అయితే అక్కడున్న రెండ్రోజుల్లోనే అసంతృప్తి బయల్దేరింది. అందుక్కారణం బావప్రవర్తన!

బావ నాతో మర్యాదగానే ఉండేవాడు కానీ అక్కను పురుగుకన్న హీనంగా చూస్తున్నాడు. అదేమన్నా లెక్కచేయడు సరికదా హేళనగా తీసి పారేస్తాడు. సాటివారితో పోల్చి అక్కను చిన్నబుచ్చుతాడు. అయిన దానికీ, కాని దానికీ చిర్రుబుర్రులాడడమేకాక వెధవ, ముండ లాంటి పదజాలాన్ని వాడి సంస్కారహీనంగా ప్రవర్తిస్తాడు.

"ఇదేమిటక్కా బావలా మాట్లాడతాడు!" అన్నాను నేను.

"నీకు కొత్తగా ఉండొచ్చు. నాకలవాటైపోయింది." అందక్క.

"ఎలాభరిస్తున్నావే బాబూ- ఈ తిట్లన్నీ!" అన్నాను.

"భరించక ఏం చేయను?"

"తిరగబడు...."

అక్క నవ్వి ఊరుకుంది.

"రేపు నీ పిల్లలు పెద్దవాళ్ళైతే వాళ్ళకూ ఇవే బుద్ధులొస్తాయి. వాళ్ళు కూడా నిన్నిలాగే తిడితే!" అన్నాను.

అక్కకిద్దరు మగపిల్లలు. పెద్దవాడికి నాలుగేళ్ళు రెండోవాడికి రెండేళ్ళు.

"నువ్వు చెప్పింది నిజమే రెండు నెల్లక్రితం పెద్దాడు నన్ను తిడితే విని బావవాడిని నాలుగుతన్ని-ఈ యింట్లో అమ్మను నేనుతప్ప ఇంకెవరూ తిట్టకూడదు. తెలిసిందా అని హెచ్చరించారు". అంది అక్క.

'అందువల్ల ప్రయోజనముంటుందా!'

"ఏమో-ఆ తర్వాత బాబు నన్ను మళ్ళీ తిట్టలేదు"

"అక్కా! నాకు బావ పద్ధతి నచ్చ లేదు. నువ్వెలాగైనా బావను మార్చాలి. లేకుంటే అసహ్యంగాఉంటుంది" అన్నాను

"బావను మార్చడం నావల్లకాదు. ఆయన బయట ఆఫీసులోనూ అలాగే ఉంటారు" అంది అక్క.

"ఆఫీసులో అలా ఉంటే ఊరుకుంటు న్నారా?" అన్నాను.

"అవసరంలేనివాళ్ళ గొడవ చేస్తు న్నారు. అవసరమున్న వాళ్ళూరుకుంటు న్నారు. నోరు మంచిది కాదుకానీ బావది నలుగురికీ సాయపడేబుద్ధి! అందుకే అంతా ఆయన్ని తిక్కమనిషి-అని సరి పెట్టుకుంటారు..." అందక్క.

"అంతా అలా సరిపెట్టుకున్నా సరే-కట్టుకున్నదానివి నువ్వెలా సరిపెట్టుకో గలవు? ఒకసారి గట్టిగా తిరగబడితే సరి బుద్ధొస్తుంది, పెళ్ళాన్ని మనిషిలా చూడాలని తెలియని కుసంస్కారం చాలామంది మగాళ్ళకుంటుంది. కానీ నువ్వు చదువుకున్నదానివికదా - ఎదురు తిరగొద్దూ?" అన్నాను.

అప్పుడు అక్క నవ్వి- "నిజం చెప్పనా?" అంది.

"నిజమేమిటి?" అన్నాను ఆశ్చ ర్యంగా

అక్క చెప్పింది.

బావదంతా పైకపోరు గాంభీర్యం. లోపల చిన్నపిల్లవాడులాంటివాడుగానీ మనసు వెన్న. అక్కలేకపోతే ఉండలేడు అక్కనేనైనా అంటే భరించలేడు. నిజా నికి అక్క అత్తగారు మంచిదికాదు. ఆవిడ బావదగ్గరే ఉండి కోడలి నారడి పెట్టాలని చూసింది. బావ సాగనివ్వలేదు "నువ్వు తల్లివేకావచ్చు. కానీ నీ పద్ధతి మార్చుకోకపోతే నా దగ్గరుండొద్దు-" అని చెప్పి పంపించేశాడు బావ. అక్క అత్తగారిప్పుడు బావ తమ్ముడి దగ్గరుం టోంది. బావ తమ్ముడు మొహమాట స్థుడు. అతడి భార్య అత్తగారి చేతుల్లో అవస్థపడుతోంది.


ఇదవిని నేనాశ్చర్యపోయినా "అయితే మాత్రం బావ తిట్టనెలా సహిస్తావు?" అన్నాను.

అక్క [illegible] "బావనాకు పరాయి వాడు [illegible]కదా! తాళికట్టిన భర్త. ఆయన తిడుతూంటే నాకవి తిట్లలా అని పించవు. చెప్పాలంటే నాకు బావ తిడు తోన్నప్పుడు నవ్వొస్తుంది. ఎలాగో కష్ట పడి దాచుకుంటాను" అంది.

"అలాతిడుతూంటే నవ్వెలాగొస్తుందె బాబూ!" అన్నానాశ్చర్యంగా.

అక్క అప్పుడు నాతో నెమ్మదిగా ఇలా అంది "నల్లనివన్నీ నీళ్ళుకాదు. తెల్లనివన్నీ పాలుకావు. ఏ మనిషినైనా తెలుసుకునేందుకు సాహచర్యం అవసరం. భార్యాభర్తలను మించిన సహచరులెవ రుంటారు? నిజంచెబుతున్నాను. బావంటే నాకెంతో యిష్టం. ఆయన ప్రవర్తనపట్ల నాకు అసంతృప్తిలేదు. కొంతమారితే సంతోషిస్తానుగానీ మారకపోతే బాధ పడను. ఆయన్ని నేనింతగా అభిమానిస్తు న్నానంటే అందుకేదో కారణముండి ఉండాలిగదా! ఆ కారణమేమిటంటే- సాహచర్యంలో నేనర్థం చేసుకున్న బావ మంచితనం, గొప్పతనం! బావ పద్ధతి






చూసి ఇక్కడ నేనేదో కష్టపడిపోతున్నా నని భ్రమపడకు. ఈ సృష్టిలో భార్యా భర్తలదొక అపూర్వబంధం. ఒకొక్కరి దాంపత్య జీవితమొకోవిధంగా ఉండ వచ్చు. కానీ ప్రతి బంధమూ అపూర్వమై నదే!"

అక్క మాటలు నాకంతగా నచ్చ లేదు.

మావారు నన్ను మాటిమాటికీ పొగుడు తారు. ఆ పొగడ్తలహాయిలో వారికోసం నేనెన్ని పనులైనా చేయగలను. కానీ పనులన్నీ చేయించుకుంటూ చీదరించు కునే బావని-అక్క ఎలా భరిస్తోందో నాకర్థం కావడంలేదు.

బహుశా మనసు సరిపెట్టుకుని ఉంటుంది, నా ముందు బయటపడడం ఇష్టంలేకపోయి ఉంటుంది.

అక్కడ అక్కమీద జాలిపడుతూనే మరో నాలుగు రోజులున్నాను. ఈలోగా శ్రీవారినుంచి ఉత్తరం వచ్చింది.

నేను లేకపోవడంవల్ల వారొక్క క్షణం కూడా గడపలేకపోతున్నారుట. ఇల్లంతా నరక ప్రాయంగా మారిందట. ఇకమీదట పూర్తిగా నా అడుగుజాడలలో నడుస్తారుట. నా కనుసన్నలలో మెలగు తారట. తన్ను క్షమించి వెంటనే రమ్మన మని వారి ఉత్తరం.

ఇలా ఉత్తరాలురాసే భర్తలరుదను కుంటాను. వారాఉత్తరం వ్రాయక పోయినా నేను బావ కారణంగా అప్పటికే వారి గొప్పతనాన్ని గ్రహించాను

వెంటనే ప్రయాణమయ్యాను.


అక్క నాకు చీరపెట్టింది. అల వాటైన పిల్లలు నన్ను వదల్లేదు వీడ్కోలు చెప్పడానికి స్టేషనుకు వచ్చిన బావను చూస్తే కుసంస్కారి అనిపించలేదు.


నేను తిరిగిల్లు చేరగానే వారు నన్ను దగ్గరగా తీసుకుని "ఇంకెప్పుడూ నన్ను విడిచి వెళ్ళకు" అన్నారు. నేను వారి కౌగిలిలో కరిగిపోయాను.

వారు నాకోసం రెండురోజులు సెలవు పెట్టారు.

ఆ తర్వాత వనజ నన్ను పలకరిం చింది. శ్రీవారి గురించి వచ్చేయాల్సి చ్చిందనీ-మా అక్క నన్ను వదల్లేదనీ చెప్పాను. ఆయన ఉత్తరంలోని కొన్ని వాక్యాల నుదహరించాను కూడా!

వనజ ఆశ్చర్యపడి- "మీ వారికి







పొగడ్డం బాగా తెలిసి ఉండాలి. నువ్వు లేనందుకాయనింకే ఇబ్బంది పడ్డారో తెలియదుకానీ-నిక్షేపంలా తనకు తనే వంట చేసుకుని తిన్నారు. ఇల్లు నీటుగా సర్దుకునేవారు. మేమురోజూ మా యింట్లో ఫోంచేయమంటే ఒకపూట మాత్రం ఫోంచేసి-మర్నాడు మాకు చిన్నగిన్నెడు సాంబారిచ్చి-"నేను వంట చేసుకోగలనన డానికి సాక్ష్యమిది" అన్నారు. ఆ సాంబారెంత బాగుందనుకున్నావ్ ? అప్ప ట్నించీ మావారు నన్నొకటే సాధింపు-నీకు మగాళ్ళపాటి వంటకూడా రాదని." అంది.

తెల్లబోయాను. వారికి వంటొచ్చని నాకు తెలియదు.


వనజ అబద్ధం చెబుతోందా ? చెబు తోందనుకుందామంటే ఆమెకా అవసర మేమిటి ?

ఒకటి మాత్రం నిజం. నేను తిరిగి వచ్చేసరికి-ఇల్లు ఆడవాళ్ళు మసలని ఇల్లులాలేదు.

చెప్పాలంటే నాకంటే నీట్‌గా మెయిం టైన్ చేశారు వారు.

ఆ సాయంత్రం వారాఫీసు నుంచి రాగానే నిలదీశాను.

"చూడు వసూ ! నీ వంటకలవాటు పడ్డాక నేనింక ఎవరివంటా తినలేను, హోటల్ కూడు నాకు పడదు. అందుకే ఏదో ఇంట్లో ఇంత ఉడకేసుకు తినేవాణ్ణి నిజంగానే నాకు అద్భుతంగా వంటొచ్చ నుకో.... అలాంటప్పుడు మాట్లాడకుండా నీ వంట తింటున్నానంటే - నీదెంకా అద్భుతమైన వంటగదా ! వసూ ! నన్ను తప్పుగా అర్థం చేసుకోకు. ఇంట్లో నేను



పూర్తిగా నీమీద ఆధారపడి జీవిస్తాను. అందులో నేనా కానందం. నీవు లేకపోతే బ్రతకడం కోసం తిండి. నీవుంటే నీ కోసం బ్రతుకు, ఈ ఇంట్లోని ప్రతి అణువూ నీతోనే శోభిల్లుతుంది. నీవు లేక ఈ యిల్లు స్మశానమైపోతుంది. అందుకే అనుక్షణం నీకోసం తపించి పోయాను. ఆ తపనలోంచే నా ఉత్తరం పుట్టుకొ చ్చింది...."

శ్రీవారి మాటలు వినగానే నాకొక విషయం అర్థమైంది.

వారికి రాని విద్య లేదు. వారి ఓర్పుకు అంతంలేదు.

ఆఫీసులో ఓపిగ్గా పని చేస్తారు. ఇంట్లో నన్ను భరిస్తారు.

నా మనసు నొప్పించ కూడదన్నదే వారి అభిమతం.

నన్ను సంతోష పెట్టడానికే వారు నా మీద ఆధార పడుతున్నారు.

నాకుమాత్రం వారి సేవ మినహా వేరే పనేమున్నది ?

మాటలతో వారు నన్ను సంతోష పెడుతూంటే - సేవలతో నేను వారిని సంతోష పెడతాను.

ఇలాంటి భర్త స్త్రీకి అరుదైన వరం. ఆ వరాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి.

శ్రీవారంటే నాకు మరింత అభిమానం పొంగి పొరలింది.

* * *

నా స్నేహితురాలు శారద నన్ను చూడ్డానికి వచ్చి మా యింట్లో మూడు రోజులుంది.

భర్త క్యాంపుకు వెళ్ళాడు. ఈ లోగా శారదకివూళ్ళో ఏదో పని పడింది. నన్ను చూడ్డమనే పని దానిని జత పర్చింది.

మేమిద్దరం కాలేజీలో క్లాసుమేట్సు. ఇద్దరం చనువుగా ఒసే అని పిల్చుకునే వాళ్ళం.

శారద తన అదృష్టం గురించి చెప్పింది.

తనకు పుస్తకాల పిచ్చి. ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూంటుంది.

ఇంటి పనులన్నీ భర్తే చేస్తాడుట. తనకెప్పుడైనా మూడ్ కుదిరితే చిన్నచిన్న సాయాలు చేస్తుందిట.

"చెప్పాలంటే వంట మర్చిపోయా ననుకో !" అంది శారద.

నేనాశ్చర్యపడి- "మరతడికి విసుగని



ఫించదూ ?" అన్నాను.

"చెప్పాలంటే నేనాయనదగ్గర చంటి పిల్లలా గారం చేస్తాను. పొద్దున్నే లేచి కాఫీ కలిపాకనే ఆయన నన్ను లేపుతారు. బ్రష్‌మీద పేస్ట్‌కూడా వేసిస్తారు. తను చద్దన్నం తిని నాకు వేడన్నం పెడతారు" చెప్తుకు పోతోంది శారద.

"అదృష్టవంతురాలివే..." అన్నాను నవ్వుతూ.

"అందుకే ఆయన్నెప్పుడూ క్యాంపులకు వెళ్ళనివ్వను, ఎప్పుడైనా తప్పనిసరై క్యాంపులకు వెడితే - భోజనం హోటల్లోనైనా చేస్తాను. ఇలా నీలాంటి వాళ్ళమీదనైనా వాలతాను -" అంది శారద.

"నీ పద్ధతి చాలా బాగుంది -" అన్నాను.

"కానీ నాకు నీ పద్ధతే నచ్చలేదు." అంది శారద.

"ఏమిటే నీకు నచ్చని నా పద్ధతి?" అన్నాను కుతూహలంగా.

"మీ వారిని మరీ సోమరిని చేసేస్తున్నావు. అన్ని పనులూ నువ్వే చేయాలనే అతడినెలా భరిస్తున్నావే బాబూ !" అంది శారాద.

"అంటే ?"

అప్పుడు శారద నా పరిస్థితిని పూర్తిగా నామీద జాలిపడింది.

నేనప్పుడు మావారి గొప్పతనం గురించీ వారి పనులు చేయడంలో నేను పొందే ఆనందం గురించీ శారదకు చెప్పసాగాను.

అలా చెబుతూండగా ఎందుకోనాకు చెబుతున్నది నేను కాక నా అక్క అనిపించింది. వింటున్నది శారద కాక నేనేననిపించింది.

సృష్టిలో స్త్రీ పురుషుల సంబంధం విచిత్రమైనది. వివాహ జీవితం వారిని బంధించినపుడు సాహచర్య ప్రభావంతో కాలానుగుణంగా - ఒకరినొకరు అనుగుణంగా మారిపోతారు. ఒకనాడు భిన్న ధృవాలనిపించినవారు కొంతకాలానికి ఒకరికోసం ఒకరు పుట్టారా అనిపించేటంతలా మారిపోతారు.

మనం ఎందరో దంపతులను చూస్తూ వీరు కలిసి ఎలా జీవిస్తున్నారా అని బాధపడతాం. ఒకరి కారణంగా ఒకరికి సుఖం లేదేమోనని అనుమానిస్తాం. కానీ ప్రతి దంపతులదీ ఒక అపూర్వ బంధమన్న విషయం స్వానుభవంలోనే తెలుస్తుంది.

ఆలా చూస్తే ఈ ప్రపంచంనిండా ఎన్నో అపూర్వ బంధాలు. వాటిలో మాదీ ఒకటి.

అందువల్ల శారద మాటల ప్రభావం నాపైన లేదు. ♦♦♦




# రూ 1,00,000 విలువగల బహుమతులను గెలవండి

ఎంట్రీఫీజు లేదు !!!

| | | |
|---|---|---|
| 6 | | |
| | 7 | |
| | | 8 |

3 నుండి 11 వరకు గల అంకెలను వాడాలి. ఎటు చూసినా మొత్తం సంఖ్య 21 రావాలి.

| | | |
|---|---|---|
| 5 | 10 | 3 |
| 4 | 6 | 8 |
| 9 | 2 | 7 |

ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ఎంట్రీలు 15 రోజులలోపు చేరాలి

బహుమతులు :

1. మొదటి బహుమతి : రాజ్‌దూత్ మోటర్ సైకిల్ లేదా 10,000/- నగదు.
2. కన్సొలేషన్ బహుమతులు : కొత్త మోడల్ టు - ఇన్ - వన్‌లు రూ. 275 లక్షే

DIXON SALES CO. (J.H.M)
B-15, New Govind Pura, Delhi51.



# రూ.1,00,000 ల. బహుమతులను గెలవండి

ఎంట్రీఫీజులేదు

| | | |
|---|---|---|
| 11 | | |
| | 12 | |
| | | 13 |

8 నుండి 16 వరకుగల అంకెలను ఉపయోగించాలి. ఎటు చూసినా మొత్తం సంఖ్య 36 రావాలి. ఒక అంకెను, ఒకసారి మాత్రమే వాడాలి. మీ ఎంట్రీలు 15 రోజులలోగా చేరాలి.

| | | |
|---|---|---|
| 10 | 15 | 8 |
| 9 | 11 | 13 |
| 14 | 7 | 12 |

బహుమతులు :

మొదటి బహుమతి : రాజ్‌దూత్ మోటర్ సైకిల్ లేదా 10,000 రూ.ల నగదు బహుమతి.

కన్సొలేషన్ బహుమతులు : 275 రూ.ల విలువగల జపాన్‌వారి టు-ఇన్-వన్ గెలుపు పద్ధతిద్వారా లభించును

MECADO ENTERPRISES (J.H.M)
Gokhulpur, Gokhulpuri, Delhi-110094